

చీకట్లో వసతిగృహ విద్యార్థులు


చీకట్లో ఉన్న విద్యార్థులు

వీరఘట్టం :మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం విద్యార్థులు చీకట్లో కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం వసతి గృహంలో చేరే విద్యార్థులకు అనేక మౌలిక వసతులు కల్పించినప్పటికీ వసతి గృహం అధికారులు నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో విద్యార్థులు చీకటిలో గడిపారు. వసతి గృహంలో ఇన్వర్టర్ సదుపాయం ఉన్నప్పటికీ రెండేళ్ల నుంచి ఇది పని చేయకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడల్లా విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

మన్యంలో మడం తిప్పని పోరాటాలు

ప్రభుత్వ విధానాలపైనా, నిర్లక్ష్య వైఖరిపైనా, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడంపైనా ఈ ఏడాది ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా సంఘాల పోరాటాలు పెల్లుబికాయి. కొన్ని రంగాలకు చెందిన సమస్యలపై చేపట్టిన నిరసనలు హోరెత్తాయి. ముఖ్యంగా అందరికీ అన్నంపెట్టే రైతులు జీవన పోరాటం చేశారు. పనిదినాలు పెంచాలంటూ ఉపాధి కూలీలు.. స్కూళ్లను పరిరక్షించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు.. నిరుద్యోగ సమస్యలపై డివైఎఫ్ఐ.. లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని కార్మిక లోకం.. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలంటూ స్కీమ్‌వర్కర్లు... ఇలా ఒకటేమిటి? మన్యం జిల్లాలో అన్ని తరగతులు, విభాగాలకు చెందిన ప్రజానీకం గళం విప్పుతూ రోడ్లపైకి వచ్చారు



- రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై పోరాటం
- ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దని సంతకాల సేకరణ
- పెల్లుబికిన విద్యార్థి ఉద్యమాలు



ఉద్యమాలు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి తక్కువ కాలమైనా ఈ ప్రాంతంలో సిపిఎం, దాని ప్రజాసంఘాలు అలుపెరుగని పోరాటం చేశాయి. జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు నాయకత్వంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అలుపెరుగని పోరాటం చేపట్టారు. అధికారపార్టీ కనుసన్నల్లో పని చేస్తున్న పోలీసుల నిర్దాక్షిణ్యంగా అణిచివేతకు గురి చేస్తున్నా ఎదురించి పోరాటాలు చేసిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన ధాన్యం పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన జీపుజాతాలు, ఆందోళనలు జరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు దీనికి సంబంధించి సచివాలయం, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర చేపట్టారు. అక్కడే రెండు రోజుల పాటు నిరాహారదీక్షలు చేపట్టారు. 10మండలాల్లో ధాన్యం బస్తాలతో రాస్తారోకోలు నిర్వహించారు. 20కేంద్రాల్లో రైతులతో కలిసి పోరాటాలు జరిగాయి. డిసెంబర్లో మండల కేంద్రాల్లోనూ, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు జరిగాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పాత ఫించన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు చేసిన ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. కురుపాంలో ఏర్పాటు చేయనున్న గిరిజన ఇంజనీరింగ్ కళాశాల కోసం చేపట్టనున్న భూసేకరణ నష్టపరిహారం చెల్లించిన తర్వాత పనులు చేయాలని పోరాడడం జరిగింది. గిరిజన రైతులు కోల్పోతున్న భూమి కి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ లు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఫిబ్రవరి 14న పనులు ఆపాలని చేసిన పోరాటానికి స్పందించిన ప్రభుత్వం చర్చలు జరిపి ఇంకొక చోట భూమి ఇవ్వడానికి అంగీకారం తెలిపింది.

లచ్చయ్యపేటలో గల ఎన్ సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న చెరుకు రైతులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘ పోరాటం చేపట్టారు. ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమానికి స్పందించిన ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లింపు చేసింది. మార్చి28, 29న నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న కార్మికులకు మద్దతు గా సిపిఎం నిలబడింది. సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ ఊరూరా జిల్లా పరిధిలో జీపుజాతా లు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 20వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో మైథాన్ కార్మి కులకు మద్ద తుగా పోరాడారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కార్మికుల ను అడ్డుకోవడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే మైదాన్ కంపెనీ యాజమాన్యం వైపు కాపు కాశారు. ఈ పోరాటంలో పాల్గొన్న 60మంది సిపిఎం, సిఐటియు నాయకులపై తప్పుడు కేసు లు బనాయిం చారు. 45 రోజుల పాటు విశాఖ సెంట్రల్ జైలు జీవితాన్ని గడిపిన చరిత్ర వుంది. ఈ తప్పుడు కేసు లకు వ్యతిరే కంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో యాజమాన్యం కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఎయిడెడ్ పాఠశాలల, కళాశాలల ఎత్తివేతకు నిరసనగా జీపుజాతా చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పార్వతీపురంలోని ఎస్ విడి డిగ్రీ కళాశాల ని ప్రభుత్వమే నడపాలని నిరాహారదీక్ష లు చేపట్టారు. దీనికి స్పందిస్తూ ప్రభుత్వం డిగ్రీ కళాశాల ను ప్రభుత్వ పరం చేసింది. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని నిర్వహించారు. పదివేల సంతకాల సేకరణ చేపట్టింది. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పట్టణాల్లో సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేశారు. మన్యం జిల్లాలో జీడి రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యాన పోరాటం జరిగింది. పదివేల మంది గిరిజన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై కేంద్ర బృందం జీడితోటలను పరిశీలించింది. ఉపాధిహామీ చట్టంలో కూలీలకు రెండు పూటలా పని విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. సవర భాషా వాలంటీర్ల సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. పార్వతీపురం మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను సమీప గిరిజన గ్రామం డంపింగ్ యార్డుకు తరలించొద్దని ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. కురుపాం నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ఏనుగుల సంచారం వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ అటవీశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పాచిపెంట మండలం పనుకువలసలోని రేషన్ డిపో తరలింపునకు వ్యతిరేకంగా జరిగిన రాస్తారోకోలో పాల్గొనడం జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో జీవో 3ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బోయ, వాల్మీకి బెంతు ఒరియా కులస్తులను ఎస్టీల్లో కలపొద్దని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కురుపాం మండలం నీలకంఠాపురంలో బ్యాంక్ ఎత్తివేతకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మన్యం జిల్లాలోని సిహెచ్ డబ్ల్యులు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి.


మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎంఇఒ వైఖరిపై
ఉపాధ్యాయుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

స్థానిక ఎంఇఒ నిరంకుశ వైఖరికి విడనాడాలని యుటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఇఒ ప్రసాద్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోగా, సమస్యలను పరిష్కరించాలని అడిగిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు సెలవుల మంజూరు విషయంలో తనకు నచ్చిన వారికి మంజూరు చేస్తున్నారని, నచ్చని వారిని మానసికంగా వేధిస్తున్నారని నాయకులు ఆరోపించారు. సెలవు మంజూరు కోసం వెళ్ళిన ఉపాధ్యాయులను యుటిఎఫ్‌లో మీరి ఎందుకు ఉన్నారు? నాకు వ్యతిరేకంగా మీరు పోరాటాలు చేస్తున్నందునే మీకు సెలవు ఇవ్వనంటూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సెలవు మంజూరు కోసం వెళ్లిన వసంతనాయుడు అనే ఉపాధ్యాయుడ్ని బయటకు పో లేకపోతే ఈడ్చేస్తానని బెదిరించారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు అన్నారు. రెండు రోజుల్లోగా ఎంఇఒపై చర్యలు తీసుకోకపోతే నిరవధికంగా దీక్షలు చేపడతామని, జిల్లా అధికారులకు ఈ విషయమై బహిరంగంగా తెలియ చేస్తున్నట్టు చెప్పారు. ఆందోళనలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకంపేట రేషన్‌షాపు జెసి తనిఖీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్


రేషన్‌డిపో రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఆనంద్

మండలంలోని వెంకంపేట రేషన్‌షాపును శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ తీళ్ల మాధవరావుతో మాట్లాడి డిపో నిర్వహణ గురించి ఆరా తీశారు. షాపులో ఉన్న సరుకులను, స్టాకు రిజిష్టర్‌ను సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగినా, సరకులు పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజా సమస్యలపై పిఎన్ఎం పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రజా సమస్యలపై ప్రజానాట్య మండలి నిరంతరం పోరాడుతుందని ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సమావేశం పార్వతీపురంలో ప్రజానాట్యమండలి కళాకారుడు మండంగి పాండు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రగతి కోసం, కళ ప్రజల కోసమని, ప్రజానాట్యమండలి నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తుందని అన్నారు. ఆ దిశగా జనవరి 2న ప్రజా కళాకారుడు సర్దార్ హస్మీ వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కళాకారులకు పిలుపునిచ్చారు. కీర్తిశేషులు డాక్టర్ గరికిపాటి రాజారావు ప్రజానాట్యమండలి స్థాపించిన తర్వాత సామాన్య ప్రజల నుంచి రైతాంగ, వ్యవసాయ కార్మిక, ఉద్యోగుల సమస్యలపై నాటికలు, పాటల ద్వారా జీవన విధానాన్ని మార్చేలా ప్రజానాట్యమండలి ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజానాట్యమండలిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. అలాగే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి అయినా నేటికీ మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయని, విద్య, వైద్యానికి సామాన్య ప్రజలు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరందర్నీ కళారూపాల ద్వారా చైతన్యపరుస్తూ ప్రజానాట్యమండలి పని చేస్తుందన్నారు. రానున్న కాలంలో నాటికలు, పాటలు, జానపద కళలు అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, అందుకే హస్మీ స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు హిమరక రామారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలి

సాలూరు : మున్సిపల్ కార్మికులకు చెల్లించాల్సిన ఒండు నెలల హెల్త్ అలవెన్సు బకాయిలు విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ పట్టణ కార్యదర్శి టి.శంకర్ ఆధ్వర్యాన కార్మికులు కమిషనర్ శంకరరావును అతని కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య నిర్వహణలో కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరారు.

పాఠశాలలో విజిలెన్స్ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం భోజనం ఏవిధంగా అమలవుతుందో పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ వ్యత్యాసం ఉందో లేదో పరిశీలించారు. విద్యా దీవెన కిట్లు పంపిణీ చేశారా లేదా ఆరా తీశారు. ఆయనతో పాటు ఎంఇఒ ఆనందరావు, హెచ్ఎం శ్రీనివాసరావు ఉన్నారు.

షాపుల లీజులు ఆపండి

- కౌన్సిల్‌లో సభ్యుల డిమాండ్
- ప్రజాశక్తి కథనంపై చర్చ

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీలో శుక్రవారం చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవలే ప్రజాశక్తిలో పాతబస్టాండ్‌కు దగ్గరలో విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి ఆనుకుని ఉన్న నగర పంచాయతీకి సంబంధించి 1వ నెంబర్ షాపు వేలం పాట వేశారని వార్త ప్రచురితమైంది. దీనిపై కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, గంగునాయుడు, కొంచాడ అరుణ్ మాట్లాడారు. ఐదు షాపులు ఉండగా కేవలం ఒక్కషాపుకే వేలం వేయడమేమిటని ప్రశ్నించారు. మార్చిలో ఐదు షాపులకు వేలం వేశారని, మళ్లీ ఈ నెలలో ఒక్కషాపునకు వేలం వేసి నాలుగు షాపులు శిథిలావస్థలో ఉన్నట్టు చెప్పడం సరికాదన్నారు. దీనిపై ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ అన్ని షాపులు మరమ్మతులు చేపట్టాక వేలంపాటకు పిలవాలని కమిషనర్ సర్వేశ్వరరావును ఆదేశించారు. గారమ్మకాలనీలో రూ.3 లక్షలతో పనులు చేసి ముందస్తు అనుమతులు లేకుండా బిల్లులు పెట్టడంపై గత సమావేశంలో చర్చించారు. దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని ఐదో వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు ప్రశ్నించగా, దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఎంఎల్ఎ, ఎంఎల్‌సితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి


ఎంపిడిఒ కార్యాలయంలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్

ముఖ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జనవరి 1 నుంచి మండల స్థాయి ఉద్యోగులంతా ముఖ ఆధారిత యాప్ ద్వారా అటెండెన్స్ వేసుకోవాలని జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆయన కార్యాలయంలో ఉద్యోగుల హాజరు పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఉద్యోగి ఎవరైనా సెలవుపై వెళ్తే తప్పనిసరిగా సెలవు చీటీని రాసి పెట్టాలన్నారు. లేనిచో ఆబ్సెంట్‌ను నమోదు చేయాలని సూచించారు. అలాగే కార్యాలయపు రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసి సక్రమంగా భద్రపర్చుకోవాలన్నారు. మరోసారి ఎంపిడిఒ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఆ సమయానికి కార్యాలయపు రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని అన్నారు. వచ్చే జనవరి నుంచి తాను పార్వతీపురం మన్యం జిల్లాలో వారానికి రెండు రోజులు విధులు నిర్వహిస్తానన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలు మన్యం జిల్లాలో అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయన వెంట ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ జి.జగదీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

లింగ నిర్ధారణ చేసిన వారిని పట్టుకొని శిక్షించాలని సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్లో జరిగిన పిసి పిఎన్‌డిటి సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కమిటీలోని సభ్యులు స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. 2001 లెక్కల ప్రకారం ప్రతి 1000 మంది పురుషులకు 961 మహిళలు కాగా 2011 లెక్కల ప్రకారం 943కు తగ్గిందన్నారు. ఇందుకు భ్రూణహత్యలే కారణమన్నారు. ఆ పరిస్థితి రాకూడదన్నారు. ఆడపిల్లలు ముద్దు అనేది అందరికీ అర్థం కావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డిహెచ్ఒ విజయపార్వతి, కమిటీ సభ్యులు పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జె.రవీంద్రకుమార్, న్యాయ సలహా దారు లక్షుం నాయుడు, జనచేతన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శశిభుషన్ చౌదరి, స్త్రీ ప్రసూతి వైద్యులు హరిషా, యోగేశ్వరారెడ్డి, దుర్గారావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

కన్వీనర్లు, వాలంటీర్లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేసి రెండోసారి వైసిపిని అధికారంలోకి తీసుకోవాలని వైసిపి ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన వైసిపి కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చారని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు. ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు ముఖ్యమంత్రిపైన, పార్టీ నాయకులపైనా లేనిపోని అసత్య ప్రచారాలను చేస్తూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని, వీటిని ప్రజలంతా గమనించాలని అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో లంచగొండితనం లేకుండా, పార్టీలు చూడకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని రెండోసారి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు శోభ హైమావతి, తూర్పు కాపు సంక్షేమ సంఘం చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేష్, మూడు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తనిఖీలు శూన్యం

నకిలీల బారిన రైతులు

ప్రజాశక్తి-పాలకొండ/ పాలకొండ రూరల్

అధికారులు చేపట్టాల్సిన తనిఖీలు సక్రమంగా చేపట్టకపోవడంతో రైతులు దగాపడుతున్నారు. ఆరుగాలం కష్టపడే రైతులకు అధికారుల సహాయం అందడం లేదని చెప్పవచ్చు. ముఖ్యంగా రైతుల కోసం ఉన్న వ్యవసాయాధికారుల జాడే కనిపించడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతుల సమస్యలు పట్టించుకోవాల్సిన వ్యవసాయధికారులు గాలికి వదిలేస్తున్నారు. మండలంలో 17వేల ఎకరాల్లో వరిసాగు, 5వేల ఎకరాల్లో రబీసాగవుతుంది. అయితే రైతులు కాయాకష్టం చేసుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్నారే తప్ప క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు వెళ్లి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించిన దాఖలాల్లేవు. ఇక్కడున్న ఎడి స్థాయి అధికారి కూడా జాడే కరువవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం వారానికి ఒకరోజు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన సదస్సులు చేపట్టాలని ఉన్నప్పటికీ అటువంటి చర్యలు తీసుకునే దాఖలాలు లేవు.

పురుగుల మందుషాపుల తనిఖీలేవీ....


పట్టణంలోని ఎరువుల దుకాణం

నెలలో రెండుసార్లు పురుగుల మందు షాపులను వ్యవసాయాధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. మండలంలో నాలుగు పురుగుల మందుల షాపులున్నాయి. అయితే వ్యవసాయశాఖాధికారులు అక్కడకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో వారితో ఉన్న సత్సంబంధాలే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో నిషేధించిన పురుగుల మందులు ఇక్కడ విక్రయిస్తున్నా సరిగా పట్టించుకునే దాఖలాలు లేవు. అదే విధంగా గడ్డిమందు వాడడం వలన ప్రమాదమని హెచ్చరిస్తున్నా అవి ఇక్కడ జోరుగా విక్రయిస్తున్నప్పటికీ దానిపై దృష్టిపెట్టడం లేదు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు పట్టించుకుని రైతాంగానికి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



అగ్నిప్రమాదంలో కాలిపోతున్న వరికుప్పలు

అజ్జాడలో భారీ అగ్ని ప్రమాదం

బలిజిపేట : మండలంలోని అజ్జాడలో భారీ అగ్ని ప్రమాదం శుక్రవారం సంభవించింది. పంటకళాల్లో ఉన్నటువంటి ముగ్గురు రైతులకు చెందిన ధాన్యం కుప్పలు, బస్తాలు పూర్తిగా బూడిదయ్యాయి. ఈ మంటలను ఆర్పేందుకు గ్రామస్తులు సంఘటనా స్థానికి వెళ్లినప్పటికీ అగ్నికీలలు ఉవ్వెత్తిన ఎగిసిపోవడంతో ప్రజలు అదుపు చేయలేక దూరాన్ని ఉండియారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన గుంప స్వామినాయుడు కి చెందిన 15 బస్తాలు , మామిడి పైడియ్యకు చెందిన ఆరు ధాన్యం కుప్పలు, బోను చంద్రశేఖర్ చెందిన పది బస్తాలు పూర్తిగా మంటల్లో బూడిదయ్యాయి. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు మూడు లక్షల రూపాయలు వరకు నష్టం వాటిలినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బిలి అగ్ని ప్రమాపక సిబ్బంది మంటను అదుపు చేస్తున్నారు. చేతి వద్దకు వచ్చిన పంట కళ్లదెటే బూడిదవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నూర్చిన ధాన్యం సకాలంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఇఒ కృష్ణమూర్తి

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

వీరఘట్టం : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంఇఒ పి.కృష్ణమూర్తి యుటిఎఫ్ ప్రచురించిన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్య రంగ పరిరక్షణకు యుటిఎఫ్ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సుధీర్ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.గౌరినాయుడు, కె.గోవిందరావు, కోశాధికారి బాణంగి వాసుదేవరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.మహేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ వి.అన్నాజీరావు, మండల కార్యవర్గ సభ్యులు కండపు రాము, బి.శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న రామానుజన్ మేథ్స్‌క్లబ్ వ్యవస్థాపకులు రజనీకాంత్, మిత్రులు

కిడ్నీ బాధితుడికి ఆపన్నహస్తం

సాలూరు : పట్టణ పరిధిలోని పిఎన్ బొడ్డవలసలో తేగల సురేష్ (33) గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. రెండు కిడ్నీలు పాడవ్వడంతో అతని భార్య అనురాధ ఒక కిడ్నీ ఇవ్వడానికి అంగీకారం తెలిపింది. అయితే ఈ కిడ్నీ మార్పిడికి అవసరమయ్యే ఖర్చు భరించే స్థితిలో ఆ కుటుంబం లేదు. ఈ విషయం తెలుసుకున్న రామానుజన్ మేథ్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్, అతని మిత్రులు కొల్లి గిరిబాబు, కెవి సత్యనారాయణతో కలిసి శుక్రవారం సురేష్ ఇంటికి వెళ్లి రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. సురేష్ కుటుంబానికి అండగా నిలిచేందుకు మరికొందరు దాతలు ముందుకు రావాలని రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్ కోరారు.

మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో నడుస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల వసతి గృహాల్లో బకాయి ఉన్న మెస్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్, అప్పన్న, వెంకటరమణ డిమాండ్ చేశారు. మెస్ బిల్లులు బకాయిలు నిలిచిపోవడంతో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడానికి హాస్టల్ వార్డెన్లు, మేట్రిన్లు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో గిరిజన ఆశ్రమ బాలురు, బాలికలు వసతులు, అదనపు భవనాలు ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని తిరిగి విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీరఘట్టంలో గడపగడపకు...

వీరఘట్టం : మండల కేంద్రంలోని నాలుగో సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇవ్వలేని సంక్షేమం పథకాలు వైసిపి ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నానారు. ప్రతి ఒక్కరు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్‌రావు, ఎంపిపి మంతిని హేమలత- శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి బొమ్మాలి హేమలత, మాజీ పిఎసిఎస్ ఉపాధ్యక్షులు బి.లక్ష్మీనారాయణ, మేజర్ పంచాయతీ ఇన్చార్జి ఎగ్జిక్యూటివ్ అధికారి బి.కోటేశ్వరరావు, సర్పంచ్ గౌరమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు డి.లలితకుమారి, గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

సాలూరు : పట్టణ పరిధిలోని పిఎన్ బొడ్డవలస బాలయోగి గురుకుల సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8తరగతి విద్యార్థులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె 78మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని దీప్తి కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ వి.శ్రీరాములు నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు తహశీల్దార్ సిహెచ్.రాధాకృష్ణ ట్యాబులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలి

భామిని : వృత్తి నైపుణ్యాలు నేర్చుకొని మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా ఎదగాలని హెూలీ క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. సింగిడి టైలరింగ్ శిక్షణ కేంద్రంలో టైలరింగ్ ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో శిక్షణా కేంద్రం బోధకులు మీన, కార్యకర్త శ్రీవిద్య పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ కిట్లు వితరణ

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన 20 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లును ఎమ్మెల్యే ఎ.జోగారావు అందించినట్లు హై స్కూల్ హెచ్‌ఎం జిల్లా ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికవ్వడంతో ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేయడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.తవిటినాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి గ్రామసభలు

సీతానగరం : జనవరి 2 నుంచి గ్రామపంచాయతీల్లో 29 అంశాలపై గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి కెకె వర్మ తెలిపారు. ఈ గ్రామ సభలో గ్రామాల అభివృద్ధి, వివిధ అంశాలపై చర్చించి అభివృద్ధి కోసం ఈ గ్రామసభలో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. గ్రామ సభల్లో ఎంపిడిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డి, ఎఒ ఎంఎస్‌ఎన్‌వి ప్రసాద్‌తో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

ఎన్ఇపి అమలుతో.. ప్రభుత్వ విద్యకు దూరం

పలు పాఠశాలలు మూత / 287 బడులు విలీనం


దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా జాతీయ నూతన విద్యా విధానాన్ని వైసిపి ప్రభుత్వం అమలు చేయడంతో ఈ ఏడాది జిల్లాలో విద్యా వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. పలు పాఠశాలలు మూతపడడం, మరికొన్ని పాఠశాలలు దూరంలోగల పాఠశాలల్లో విలీనం కావడతో పేదలకు విద్య అందని ద్రాక్షలా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం తగ్గి పరోక్షంగా ప్రయివేటు విద్యను ప్రోత్సహించింది. మరోవైపు ఉపాధ్యాయుల కృషితో టెన్త్, ఇంటర్‌తో పాటు ఎంసెట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్సులో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మరోవైపు బైండోవర్ కేసులు, గృహ నిర్బంధాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రేగిడి : పాఠశాల విలీనానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం అమలుతో జిల్లాలో విద్యావ్యవస్థ కుంటుపడింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పేద విద్యార్థులకు శాపంలా మారాయి. జిల్లాలో 287 ప్రాథమిక పాఠశాలలు మూడు కిలోమీటర్ల దూరంలోగల ఉన్నత పాఠశాలల్లో విలీనం కావడంతో వందలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. పాఠశాలల విలీనం కారణంగా సుమారు 10 వేల మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల్లో చేరారు. ఎన్ఇపి అమలులో భాగంగా బైజ్యూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 9720 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది.



శాపంగా మారిన జీవో 117, 128

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117, 128 కారణంగా జిల్లాలో పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేసింది. 23 యుపి పాఠశాలలు, 258 ప్రాథమిక పాఠశాలలు ఉన్నత పాఠశాల్లో విలీనమయ్యాయి. మరోవైపు జిల్లాలో 28 హైస్కూళ్లలో హెచ్‌ఎం, పీడీ పోస్టులు లేని దుస్థితి నెలకొంది. హేతుబద్ధీకరణ జీవో వల్ల జిల్లాలో సుమారుగా 1500 మందిని మిగులు ఉపాధ్యాయులుగా ప్రభుత్వం తేల్చింది.

మూతపడిన ఎయిడెడ్ విద్యా సంస్థలు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 18ఎయిడెడ్ విద్యాసంస్థలు మూతపడ్డాయి, కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలుగా మారాయి. స్వాతంత్ర్యం అనంతరం లక్షలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించిన ఈ విద్యాసంస్థలను ప్రభుత్వం ఒక్క కలం పోటుతో మూసేసింది. దీంతో జిల్లాలో ఎయిడెడ్ విద్యా సంస్థలు అంకానికి 2022 సంవత్సరంతో తెరపడింది.

సిబిఎస్ఇ పేరుతో మాతృ భాషకు మంగళం

జాతీయ విద్యా విధానం పేరుతో మాతృ భాష కు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడేందుకు రంగం సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగా జిల్లాలో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి 120 స్కూళ్లలో అమలుకు జిల్లా విద్యా శాఖ సిద్ధమైంది. సిబిఎస్ఇ అమలు కావాలంటే తగిన విధంగా పాఠశాలల్లో ల్యాబ్, లైబ్రరీ, ప్రాజెక్ట్ వర్క్ కోసం కంప్యూటర్ ల్యాబ్ లు ఉండాలి, జిల్లాలోని ఏ పాఠశాలలోనూ అందుకు తగిన సౌకర్యాలు లేవు. అయినా బలవంతంగా సౌకర్యాలు లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

నిర్బంధాలు, అరెస్టులు

సిపిఎస్ రద్దు కోసం పెద్దఎత్తున ఉపాధ్యాయులు ఉద్యమించారు. ఈనేపథ్యంలో అరెస్టులు, నిర్బంధాలు నడుమ పాఠశాలల్లో బోధన చేయాల్సి వచ్చింది. జిల్లాలో 80 మంది ఉపాధ్యాయులపై బైండోవర్ కేసులు పెట్టారు. పాఠశాలలకు వెళ్లి అరెస్టు చేయడం, ఇళ్ల వద్ద నిర్బంధించడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.

నాడు- నేడుతో మారిన రూపురేఖలు

జిల్లాలో మొదటి,రెండో విడత నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థలు రూపురేఖలు మారాయి. మొదటి విడతలో రూ.150 కోట్లు పైన, రెండో విడతలో రూ.200 కోట్లు పైన నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఎన్ఇపి అమలు, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో వీటిలో కొన్ని పా ఠశాలలు మూతపడడంతో కోట్లాది రూపాయలు నిధులు వృథా అయ్యాయి.

మెరుగైన ఫలితాలు సాధన

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా 77.50 శాతం ఉత్తీర్ణతతో 3వ స్థానం సాధించింది. కెజిబివి పాఠశాలల ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫలితాల్లో కాస్తా వెనుకబడింది. టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా ఇంటర్ ఫలితాల్లో మాత్రం 12వ స్థానంలో నిలిచింది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలదే పైచేయి అయ్యింది. ఎంసెట్ ప్రవేశ ఫలితాల్లో 7, 10, 15 ర్యాంకులు సాధించారు. జెఇఇ మెయిన్స్, అడ్వాన్సుడ్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి దేశంలోనే పేరుగాంచిన ఐఐటిలు, ఎన్ఐటిల్లో సీట్లు పొందారు. ఇలా పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి విద్యల నగరం పేరును సార్థకత చేశారు.

నిరుద్యోగ యువత పట్ల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడున్నరేళ్లలో నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేస్తూ అణగదొక్కిందని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి మండిపడ్డారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి శ్రేణులు శుక్రవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అన్ని వర్గాల ప్రజలు వివక్ష, నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ విధ్వంసకర విధానాలతో రాష్ట్రంలోని పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. 3.50 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని, ప్రతి ఏటా జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇస్తామంటూ హామీలు ఇచ్చి నేటికి ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు టిడిపి హయాంలో ఇచ్చిన నిరుద్యోగ భృతిని వైసిపి ప్రభుత్వం రద్దు చేయడం విచారకరమన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక పెరుగుతున్న ధరలతో బతుకు జీవనం సాగక నాలుగు రోజులకు ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకుంటున్న సందర్భాలు కనిపిస్తున్నాయన్నారు. మరోవైపు రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతూ మహిళలకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. అంతేకాక మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రకంగా చూసినా వైసిపి విధానాలు ప్రజలను కష్టాలు పాల్జేస్తున్నాయని ఆరోపించారు. ప్రజల కష్టాలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సొంటేన రాజేష్, అడ్డాకుల నరేష్, బాలరాజు, జానకి తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి

పార్వతీపురంరూరల్ : వైఎస్ జగన్ అసమర్ధ పనులతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మండలంలోని సూడిగాం, కవిటిభద్ర పంచాయితీల పరిధిలోని ఉక్కాడవలస, ఏగిరెడ్డి వలసలో శుక్రవారం నిర్వహించిన ఇదేఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేరడి-బిలో ఫ్యామిలీ ఫిజీషియన్

భామిని : మండలంలోని నేరడి -బిలో భామిని పిహెచ్‌సి వైద్యులు ఎన్.ఫణికుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మధుమేహం, రక్తపోటు, కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నారో 56మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సరిపడా మందులు అందజేశామని తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న ముగ్గురికి రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశామన్నారు. స్థానిక ప్రాథమికొన్నత పాఠశాలలో పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్ వాష్ టెక్నిక్‌పై అవగాహన కల్పించి ఐఒడిన్ టెస్ట్ నిర్వహించారు. అందరూ ఐయోడైజెడ్ సాల్ట్ వినియోగించాలని, పిల్లలు మానసిక ఎదుగుదలకు ఇది తప్పనిసరి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్, ఎఎన్‌ఎం నీరజ, ఎంఎల్‌పిహెచ్ దివ్య, హెల్త్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

బుచ్చి మాస్టారు మరణం బాధాకరం

కురుపాం : ఎపిటిఎఫ్ ఉద్యమ నేతగా విశేష సేవలందించిన భమిడిపాటి సత్యనారాయణ (బుచ్చి) మాస్టారు మరణించడం తీవ్ర బాధాకరమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ టి.జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కురుపాంలో బుచ్చి మాస్టారు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుదీర్ఘంగా ఉపాధ్యాయ సేవలు చేసి ఎంతోమంది విద్యార్థులకు ఉన్నత స్థాయిలు తీసుకెళ్లిన ఘనత ఆయనదేనని అంతేకాక ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉపాధ్యాయుల హక్కులు, విధుల కోసం తీవ్రంగా పోరాడని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ సర్పంచ్ కిమిడి రామరాజు, టిడిపి నాయకులు కోలా చిరంజీవి తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

కురుపాం : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ శుక్రవారం మూలిగూడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వాహన చోదకులతో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించి లైసెన్స్ కలిగి అన్ని ధ్రువపత్రాలు ఉండి వాహనాలు నడపాలని సచించారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా అధిక వేగంగా వాహనాలు నడపడం వల్ల వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పించారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, లైసెన్స్ లేని వారికి వాహనాన్ని ఇచ్చినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

సీతానగరం : నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. శుక్రవారం అప్పయ్యపేట జంక్షన్‌లో వాహనదారులతో ప్రమాణపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం వేళ ప్రతి వాహనదారుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ ఒక్కరూ మద్యం తాగి వాహనం నడప రాదని గ్రామాల్లో అల్లర్లు చేయకూడదని హెచ్చరించారు. వీటిని ఎవరైనా అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

నాలా చెల్లించాల్సిందే

పాలకొండ రూరల్

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చితే నాలా చెల్లించాల్సిందేనని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. శుక్రవారం ఎన్.కె.రాజపురం ప్రాంతంలో నాలాకు సంబంధించిన భూములు, వాణిజ్య దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పక్కాగా ఉంటేనే నాలాకు అనుమతిస్తామన్నారు. నాలా చెల్లించకుండా నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఆయన వెంట తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, విఆర్‌ఒలు బలివాడ శ్రీనివాసరావు, అవినాష్ ఉన్నారు.

రహదారి నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

సాలూరు : పట్టణ నడిబొడ్డు మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాచిపెంట మండలం పి.కోనవలస నుంచి మున్సిపాలిటీ పరిధి వరకు రహదారి నిర్మాణం జరుగుతోందని చెప్పారు. తారురోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రమాణాలు పాటించడం లేదని అన్నారు. సరిగ్గా రోలింగ్ చేయకుండా నిర్మాణమైన వెంటనే వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తున్నారని తెలిపారు. దీనివల్ల రహదారి తొందరగా పాడవుతుందని చెప్పారు. దండిగాం రోడ్డు నుంచి పి ఎన్ బొడ్డువలస వరకు రహదారి నిర్మాణంలో ఆర్ అండ్ బి అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రహదారి పదేపదే పెచ్చులూడుతోందన్నారు. అదే పరిస్థితి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో కనిపిస్తోందన్నారు. జిల్లా అధికారులు వెంటనే రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

గిరి పంటలకు గిట్టుబాటు ధర

మక్కువ : గిరిజనులు పండించే పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని విబికె ఎపిడి వై.సత్యంనాయుడు అన్నారు. శుక్రవారం మార్కొండపుట్టి పంచాయతీ కాకులవానివలసలో విబికె సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో గిరిజనలు పండించే పంటలు వాల్యూ ఎడిషన్ ద్వారా గిట్టుబాటు ధరలు అందించి, దళారుల బారినపడకుండా విబికెలో గిరిజనులకు అండగా ఉంటుందన్నారు. తక్కువ ధర కాకుండా మంచి ధర వస్తుందన్నారు. గిరిజనులు పంటలను జాగ్రత్తగా చేసుకునేందుకు అవసరమైన యంత్రాలు, నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం సన్నిబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దని, అలాగే అన్ని గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని జనవరి 6న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు రామారావు కోరారు. ఈ మేరకు ధర్నా గోడ పత్రికను నందాపురంలో శుక్రవారం గిరిజన సంఘ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం తమన్నదొరవలస నుంచి నందాపురం గ్రామం మీదుగా పెదమరికి వరకూ రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు మాట్లాడుతూ విక్రాంపురం పంచాయతీ తమన్నదొరవలస నుంచి నందాపురం మీదుగా పెదమరికి వరకు రహదారి సౌకర్యం నేటికీ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించి, గిరిజనులకు విద్య, వైద్యం మెరుగైన సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై జనవరి 6న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని, కావున గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, మల్లేశు, వెంకటరమణ, సతీష్, శంకర్రావు, తిరుపతిరావు, సింహాచలం, గౌరినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల అభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని రావాడ రామభద్రపురం, జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపిపి బొంగు సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో ఆసుపత్రుల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ ఈరెండు పిహెచ్‌సిల అభివృద్ధికి చెరో రూ.లక్షా 75 వేలు, చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పిహెచ్‌సిల్లో స్టేషనరీ, ఫర్నీచర్, విద్యుత్తు భవనాల మరమ్మతుల పనులకు ఈ నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందిని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ రమేష్, వైద్యాధికారులు తిరుపతిరావు, శ్రావణ్ కుమార్, సర్పంచ్ ఈదెల రాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం : సబ్సిడీపై అందజేస్తున్న వేరుశెనగ విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి కోరారు. ఆర్‌బికెలో శుక్రవారం రైతులకు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులతో పాటు సలహాలు, సూచనలు సిబ్బంది అందించడం జరుగుతుందన్నారు. పదిమంది గిరిజన రైతులకు నాలుగు క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి శ్యామల, వార్డు మెంబర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

పాచిపెంట : మండల కేంద్రంలో గల ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యతా ప్రమాణాల నిర్ధారణకు విత్తనాలు, ఎరువుల నమూనాలను సేకరించి పరీక్షల కోసం సంబంధిత పరీక్ష కేంద్రాలకు అందిస్తామని, నాణ్యతలేని విత్తనాలు గానీ, ఎరువులు గానీ, పురుగుమందులు గానీ విక్రయించినట్లయితే సంబంధిత ఎరువుల దుకాణాలపైనే కాకుండా తయారీ కంపెనీలపై కూడా కేసు పెడతామని హెచ్చరించారు. కావున నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు మాత్రమే విక్రయించాలని సంబంధిత డీలర్లకు సూచించారు. అలాగే రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి బృందాలు అకస్మాత్తు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని అన్నారు. ఎలాంటి తప్పులు జరిగినట్లయితే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు పురుగుమందుల కొనుగోలుకు వచ్చినప్పుడు వారిని చైతన్యపర్చి సరైన మందులను మాత్రమే విక్రయించాలన్నారు. ఈ తనిఖీలో ఎఇఒ హైమా, విఎఎ కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

నాటుసారాతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని తోణాం పంచాయతీ పులివలసకు చెందిన ఎస్.భాస్కరరావు, లాచయ్య నుంచి సుమారు 50 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా మార్గమధ్యలో పట్టుకొని వారిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి స్థానిక విలేకరలకు తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా సారాయి, గంజాయి గాని తయారీ చేసినా, రవాణా చేసినా కేసులు పెడతామని హెచ్చరించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

సీతంపేట : మండలంలోని కడగండి పంచాయతీ పెద్దవంగరకు చెందిన సవర తిరుపతిరావు 20 లీటర్ల సారాతో పట్టుబడినట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.